ప్రగతి బాటలో బాలేరు

- సుమారు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.3 కోట్లతో వంశధార వరద కాలువపై ద్రోణి నిర్మాణం
- సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.17 కోట్ల వరకు లబ్ధి

భామిని: పల్లె ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతోంది. టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి బాటపడుతున్నాయి. అందులో భామిని మండలంలోని బాలేరు గ్రామం ఒకటి. గ్రామంలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరిగింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.17,23,34,224లు ప్రభుత్వం జమ చేసింది. పరోక్షంగా రూ.4,79,58,203లు లబ్ధి చేకూరింది.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- బాలేరు వద్ద వంశధార వరద కాలువపై రూ.3 కోట్లతో ద్రోణి(ఎస్‌పీ) నిర్మాణం యుద్ధప్రాతిపదికన సాగుతోంది.
- ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు వీలుగా గ్రామంలో రూ.42 లక్షలతో సచివాలయాన్ని నిర్మించారు.
- రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, తదితర సేవలు అందించేందుకు అనువుగా రూ.26 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను రూ.84 లక్షలతో పీహెచ్‌సీలో అధునాతన వైద్య సదుపాయాలు కల్పించారు. అలాగే పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించారు.
- నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.98.98 లక్షలతో బాలేరు జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. పాత శాలను కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దారు.
- రూ.19.9 లక్షలతో బాలేరు ఎంపీపీ స్కూల్(ఆర్)లో అభివృద్ధి పనులు చేపట్టారు.



అన్నదాతలకు సేవలందించే ఆర్‌బీకే భవనం



అధునాత సౌకర్యాలతో బాలేరు పీహెచ్‌సీ భవనం

సమృద్ధిగా సాగునీరు



గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదు. సాగునీరు విడుదల చేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా వారి నుంచి స్పందన ఉండేది కాదు. రాజన్న బిడ్డ జగనన్న రైతుల కష్టాలు తెలుసుకుని సాగునీటి సమస్య పరిష్కరించారు. వంశధార వరద కాలువపై ద్రోణి(ఎస్‌పీ) నిర్మించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించారు. అలాగే రైతుభరోసా కింద ఏటా పెట్టుబడి సాయం అందించి రైతులకు అండగా నిలిచారు.

– రొక్కం రామారావు, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు, బాలేరు



వంశధార వరద కాలువపై యుద్ధప్రాతిపదికన చేపడుతున్న ద్రోణి నిర్మాణం

ప్రజల వద్దకే పరిపాలన



గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్న సాకారం చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పరిపాలను తీసుకొచ్చారు. గ్రామ వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు చేరవేశారు. పార్టీలు చూడకుండా అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చుతున్నారు. ప్రజల మనసుల్లో నిలిచిపోయారు. మరోసారి జగనన్నను గెలిపించుకునేందుకు మేమంతా ఎదురు చూస్తున్నాం.

– కొత్తకోట వెంకటమ్మ, మహిళా సంఘ నాయకురాలు, బాలేరు

ప్రతీ ఇంటికి సంక్షేమం



ప్రతీ ఇంటికి ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. నవరత్న పథకాలతో మా ఆర్థిక కష్టాలు తీరాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో తాగునీరు, శానిటేషన్, ఆరోగ్యం, తదితర మౌలిక వసతులు బాగున్నాయి.

– రౌతు కాంచన, గృహిణి, బాలేరు



నాడు–నేడుతో సర్వాంగ సుందరంగా మారిన బాలేరు ఎంపీపీ స్కూల్

క్లుప్తంగా

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ భవానీ

వీరఘట్టం: పేదల సొంతింటి కల సాకారం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రేగులపాడు సర్పంచ్ మెరుగుల భవానీ అన్నిరు. గ్రామంలో సొంత ఇల్లు లేని వారికి మంగళవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. లబ్ధిదారుల పేరిట పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు.

ఫైర్‌లైన్ పరిశీలన



ఫైర్‌లైన్ పరిశీలిస్తున్న డీఎఫ్ఓ ప్రసూన

సీతంపేట: చిన్నబగ్గ అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫైర్‌లైన్‌ను డీఎఫ్ఓ ప్రసూన మంగళవారం పరిశీలించారు. సుమారు 2.06 కిలోమీటర్ల పొడవున 15 మీటర్ల వెడల్పుతో ఫైర్‌లైన్ వేసినట్టు సిబ్బంది ఆమెకు వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఈ ఫైర్‌లైన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సబ్ డీఎఫ్ఓ సంజయ్, ఎఫ్ఆర్వో తవిటినాయుడు, ఎఫ్‌బీఓ దాలినాయుడు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా రామారావు

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దార్‌గా పి.రామారావు విధుల్లో చేరారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో మండల తహసీల్దార్ బి.శివశంకర సత్యనారాయణను కురుపాం మండలానికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఏఓగా విధులు నిర్వహిస్తున్న రామారావును గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా నియమించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన రేపు

సీతంపేట: ఈనెల 7న సీతంపేట ఐటీడీఏ పరిధిలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు పర్యటిస్తారని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెళియాపుట్టి మండల రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గిరిజనుల సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఏరియా ఆస్పత్రి, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఐటీడీఏలో సెక్టోరియల్ అధికారులతో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



పోలీసులకు సూచనలు చేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో మంగళవారం పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహణతో పాటు ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం గుమ్మ గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు పంచాయతీ కొత్తవలస గ్రామానికి చెందిన కేశవరావు బోర్‌మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తుండగా.. గుమ్మ గ్రామం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో నడుచుకుంటూ వెళ్తున్న ఉదయ్‌కుమార్, పరదేశి, కృష్ణలను వెనుక నుంచి ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయిన కేశవరావును వెనుక నుంచి వచ్చిన మరో ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు భద్రగిరి సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న కేశవరావును మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పక్కి సదాశివరావు మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో, ప్రణాళికతో విద్యనభ్యసించాలని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు ఖ్యాతి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం సీతారాముల విగ్రహాలను నాగావళి నదికి తీసుకువెళ్లి స్నానమాచరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ పూజారులు వేదుల కృష్ణారావు బృందం భక్తులచే పూజలు జరిపించారు.

మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ

పాలకొండ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రిజమ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమం ఉద్దేశాన్ని, లక్ష్యాలను ఆరోగ్య సిబ్బందికి వివరించారు. అనంతరం అన్నవరం, అంపిలి, కొండాపురం తదితర గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులను పర్యవేక్షించారు.

డంపింగ్‌యార్డ్ పనులు అడ్డగింత



డంపింగ్‌యార్డ్ పనులను అడ్డుకొని ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గరుగుబిల్లి: పార్వతీపురం మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్‌యార్డ్‌ను మండలంలోని సుంకి రెవెన్యూ పరిధి తోటపల్లి ప్రాజెక్టు పాతకాలువ గట్టుపై ఏర్పాటు చేసేందుకు అధికారులు పనులు ప్రారంభించడంపై సీపీఎం నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బీవీ రమణ, సుంకి గ్రామపంచాయతీ సర్పంచ్ కె.రవీంద్ర మాట్లాడుతూ.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఒక పక్క చెపుతూనే.. డంపింగ్‌యార్డుగా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలోని మరుపెంట, నాగూరు, సుంకి, సంతోషపురం, చిలకాం, శివ్వాం, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలకు నాగావళినది నీటిపై ఆధారపడుతున్నారని, డంపింగ్ యార్డ్ వలన నీరు కలుషితమై ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పనులను తక్షణమే నిలుపుదలచేయాలని డిమాండ్ చేశారు.

రక్తహీనత నివారణే లక్ష్యంగా 'ప్రిజమ్'



గుమ్మలక్ష్మీపురం: కుక్కిడిలో ప్రిజమ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్



గరుగుబిల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యారావు



పాలకొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

గుమ్మలక్ష్మీపురం/పాలకొండ/గరుగుబిల్లి: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రిజమ్ కార్యక్రమం ద్వారా రక్తహీనత నివారణపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుమ్మంగి, కుక్కిడి గ్రామాల్లో ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆశా, అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి పౌష్టికాహారం, మందులు అందించాలని సూచించారు. పాలకొండ మండలంలోని కొండాపురం గ్రామంలో ప్రిజమ్ కార్యక్రమంపై ఎంపీడీఓ రామకృష్ణ, అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ అవగాహన కల్పించారు. గరుగుబిల్లి మండలంలోని ఉల్లిబద్ర, తోటపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ పి.సూర్యారావు ఆధ్వర్యంలో ప్రిజమ్ కార్యక్రమం నిర్వహించారు. పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణకు ప్రాజెక్టు ఫర్ రిడక్షన్ ఆఫ్ ఇన్ఫాంట్ మోర్టాలిటీరేట్ 10 (ప్రిజమ్ 10)ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. కార్యక్రమం లక్ష్యాలను ఆరోగ్య సిబ్బందికి వివరించారు.

వైద్య సిబ్బందిని నియమించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేలా వైద్య సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, అధ్యక్షులు తాడంగి సాయిబాబు, ఉపాధ్యక్షులు ఊయక గంగరాజు, సంయుక్త కార్యదర్శి ఆరిక ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఏపీ గవర్నర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఏపీ మానవ హక్కుల సంఘం చైర్మన్‌లకు వినతిపత్రాన్ని పంపినట్లు మంగళవారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో గిరిజన విద్యా సంస్థల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు మృతిచెందారని, వైద్య సిబ్బందిని నియమిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నట్లు చెప్పారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



టీకే రాజపురంలో రక్షిత పథకం పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

పాలకొండ రూరల్: జలజీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రక్షిత పథకాల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.ఢిల్లేశ్వరావు తెలిపారు. మండలంలోని అట్టలి, టీకే.రాజుపురం, మల్లివీడు గ్రామాల్లో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన రక్షిత పథకాలను మంగళవారం పరిశీలించారు. ఒక్కో పథకం నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. త్వరలో పైపు లైన్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆ శాఖ జేఈఈ ఎ.సందీప్, ఏఈఈ హెచ్.ప్రవళిక, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు వెంకటేష్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దిశ డీఎస్పీ హర్షిత

కురుపాం: దిశ, ఫోక్సో చట్టాలపై ప్రతీ విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీ హర్షిత అన్నారు. కురుపాం మండల కేంద్రంలో ఉన్న ఆదర్శపాఠశాల విద్యార్థులకు మంగళవారం దిశ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మీ, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు ఎరువులు అందిస్తున్న చంద్రశేఖర్, చలపతిరావు

భామిని: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఆర్‌బీకేల ద్వారా రైతు అవసరాల మేరకు ఎరువులు, విత్తనాలు అందించి రైతులను ఆదుకుంటోందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. బాలేరు రైతుభరోసా కేంద్రంలో పార్టీ నాయకుడు మేడిబోయిన చలపతి ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం యూరియా బస్తాలు పంపిణీ చేశారు. రబీలో రైతులకు కావాల్సిన ఎరువులు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ–క్రాప్ నమోదుతో పంటలకు గిట్టుబాటు ధరలు అందిస్తున్నారని వివరించారు. వ్యవసాయ సహాయకులు జ్యోతి, రైతు మిత్ర తిరుపతిరావు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధితులకు సూచించారు. విక్రమపురం గ్రామానికి చెందిన పొట్నూరు గాంధీ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వం రూ.85లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కళావతి మంగళవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో విక్రమపురం మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ ఉన్నారు.

గిరిజనులకు కోడిపిల్లల పంపిణీ



గిరిజనులకు కోడి పిల్లలు పంపిణీ చేస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ టీఎస్ఎస్‌కే పాత్రో

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలం రస్తాకుంటుబాయిలోని కృషి విజ్ఞాన కేంద్రం(ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం)లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని బాడంగి, వేపాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 150 మంది గిరిజనులకు, 50 మంది ఎస్సీ లబ్ధిదారులకు మంగళవారం కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో మాట్లాడుతూ.. గోవాలోని ఐసీఏఆర్–మధ్యతీర ప్రాంత వ్యవసాయ పరిశోధన సంస్థ సహకారంతో కోడి పిల్లలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం ఐసీఏఆర్–మధ్య తీరప్రాంత వ్యవసాయ పరిశోధన సంస్థలోని పశుసంవర్ధక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్ ఉద్వార్ లబ్ధిదారులకు కోడి పిల్లల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జి.అను పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాసెస్ యంత్రాల పంపిణీ



చిరుధాన్యాల ప్రాసెస్ యంత్రాలు అందజేస్తున్న అధికారులు

సీతంపేట: వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల ప్రాసెస్ యంత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన చిరుధాన్యాల సంస్థ ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ఆర్థిక సహకారంతో వీరఘట్టం, సీతంపేట, కుశిమి, కొత్తపనుకువలస తదితర గ్రామాల రైతులకు వాటిని ఉచితంగా పంపిణీ చేసినట్లు సీనియర్ సైంటిస్ట్ సీతారం తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్ లక్ష్మీనారాయణ, పీఏఓ హరికృష్ణ, పీహెచ్ఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ రూరల్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు మంటలు ఎలా ఆర్పాలి, ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఏవిధంగా రక్షించాలో డెమో ద్వారా వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న ఉపాధి వేతనదారులు

కురుపాం: ఉపాధిహామీ పని వద్ద వేతనదారులకు తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్స్ తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధికారులకు డిమాండ్ చేశారు. మండలంలోని వలసబల్లేరు పంచాయతీలోని వలసగూడ గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. వేతనదారులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం సక్రమంగా అమలు చేసి వేతనదారులను ఆదుకోవాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా వేతనదారులకు రోజుకు రూ.600 వేతనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. వేసవీ దృష్ట్యా వేతనదారులకు పని ప్రదేశాల వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు.